న్యూస్‌రీల్

రెడ్లసత్రానికి రూ.5 లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ యోగి వేమారెడ్డి రెడ్ల సత్రంలో లిఫ్ట్ ఏర్పాటుకు పట్టణానికి చెందిన వెన్నపూస జోసెఫ్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం అందజేశారు. సత్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో విరాళం మొత్తాన్ని దాత జోసెఫ్‌రెడ్డి సత్రం కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భవనం రాఘవరెడ్డి, కార్యదర్శి పాలిమేర వెంకటరెడ్డి, కోశాధికారి మాగులూరి సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు పాపిరెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జాయింట్ సెక్రటరీలు బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాంచీస్టేషన్‌ను సందర్శించిన డివిజనల్ మేనేజరు



విజయపురిసౌత్: పర్యాటక శాఖ విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య ఆదివారం విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా లాంచీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లాంచీల్లో సందర్శకుల భద్రతకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హరిత రిసార్ట్ మేనేజర్ మస్తాన్‌బాబు, ఎత్తిపోతల మేనేజర్ యల్లాల బ్రహ్మం, వినయతుల్లా, దత్తు, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు




విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 588.40 అడుగులకు చేరింది. ఇది 307.2834 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,302, ఎడమ కాలువకు 8,718, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,292, ఎస్‌ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 53,412 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 53,412 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మహాదేవిగా పూజలందుకున్న బగళాముఖి



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో బగళాముఖి అమ్మవారు ఆదివారం మహాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. భక్తుల కొంగు బంగారంగా బాసిల్లుతున్న బగళాముఖి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూలు, పండ్లు సమర్పించారు. పూజలు చేశారు. సోమవారం అమావాస్య సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 81వ అమావాస్య హోమం, విశేష పూజలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ దగ్గర నుంచి 4,513 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం స్థిరంగా ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్‌కి 216 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,526 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 327, పశ్చిమ కాలువకు 118, నిజాంపట్నం కాలువకు 281, కొమ్మూరు కాలువకు 2,800 క్యూసెక్కులు బ్యారేజి నుంచి విడుదల చేశారు. సముద్రంలోనికి 43,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

టపాసుల ధర మోత

లైసెన్స్‌ల పేరుతో అడ్డగోలుగా దండుకున్న కూటమి నేతలు

- ఒక్కో దుకాణం అనుమతికి రూ. 25 వేల నుంచి రూ. 50 వేలు
- సొంత పార్టీ వారయినా ముడుపులు ఇవ్వకపోతే కొర్రీలు
- ఈ మొత్తం లాక్కునేందుకు భారీగా ధరలు పెంచిన వ్యాపారులు
- జిల్లాలో 39 శాశ్వత, 122 తాత్కాలిక దుకాణాలకు అనుమతులు

కూటమి నేతల దెబ్బకు పండగకు ముందే 'వసూళ్ల' మోత మోగిపోతోంది. తాత్కాలిక దుకాణాల అనుమతుల పేరుతో వ్యాపారుల నుంచి వారు వసూళ్లకు తెరలేపారు. అధికారులకు ఇవ్వాలంటూ అందినకాడికి దండుకున్నారు. నిబంధనల పేరుతో వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేశారు. ఫలితంగా వారికి భారీగా ఇవ్వాల్సి వచ్చింది. ఆ లోటు పూడ్చుకునేందుకు వ్యాపారులు సిండికేట్‌గా మారిపోయారు. టపాసుల ధరలు అమాంతం పెంచి ప్రజల నెత్తి మీద రుద్దేశారు. కూటమి నేతలకు మామూలు ముట్టజెప్పడంతో అధికారులు కూడా నిద్ర నటిస్తున్నారు. టపాసుల ధరలు ఇష్టారాజ్యంగా పెంచి అమ్మినా అడిగే వారే కనిపించకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

సత్తెనపల్లి: దీపావళి అంటే గుర్తుకు వచ్చేది టపాసులు. కానీ టపాసుల ధరలు తారాజువ్వల్లా ఇప్పుడు ఆకాశాన్ని అంటుతున్నాయి. వాటిని అంటుకోకముందే ధరలు పేలుతున్నాయి. దీంతో సామాన్యులకు పెనుభారంగా మారాయి. ఎన్నడూ లేని విధంగా ఈ దీపావళికి టపాసుల ధరలు పెరగడానికి కూటమి నేతలే కారణమని ప్రజలు మండిపడుతున్నారు. పర్వదినాన్ని వారు కాసుల వసూళ్ల పండుగగా మార్చేశారు. టపాసుల దుకాణాలకు నిబంధనలను పక్కాగా పాటించినా తమ చేతులు తడపకుంటే అనుమతులు జారీ చేసేది లేదని కూటమి నేతలు తెగేసి చెబుతున్నారు. దీపావళి సందర్భంగా జిల్లాలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు చేతివాటం ప్రదర్శించారు. నేతల తీరు ఇలా ఉంటే దుకాణాల యజమానులు మాత్రం అడిగినంత ఇచ్చి అందినకాడికి దోచుకుందామనే యోచనలో పడ్డారు. జిల్లాలో దీపావళికి తాత్కాలిక ప్రాతిపదికన బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులు ఇస్తారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, జీఎస్టీ విభాగాలు సమన్వయంతో తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేయడం ఆనవాయితీ. ఇందుకుగాను వ్యాపారులు దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవడం.. ఆపై అనుమతులు ఇవ్వడం ఏటా సాధారణం. ఇదే అదనుగా భావించిన కూటమి నేతలు అక్రమాలకు తెరతీశారు. సందట్లో సడేమియా అన్నట్లు రూ. లక్షలు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో షాపునకు ఒక్కో ధర నిర్ణయించి మరీ వసూళ్లకు తెగబడ్డారు.



విక్రయానికి సిద్ధంగా ఓ దుకాణంలోని టపాసులు



ఒక్కో దుకాణానికి భారీగా వసూలు...

బాణసంచా తాత్కాలిక దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే సదరు వ్యాపారి ప్రభుత్వం నిబంధనల మేరకు లైసెన్స్ నిమిత్తం అగ్నిమాపక శాఖకు రూ. 500 చలానా, రెవెన్యూ శాఖకు రూ. 500 చలానా, జీఎస్టీ విభాగానికి రూ. 5 వేల మేరకు అడ్వాన్సు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఓ దుకాణానికి రూ. 6 వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. కానీ కూటమి నేతలు ఇక్కడ అంతకు మించి దండుకుంటున్నారు. తాత్కాలిక దుకాణాల లైసెన్స్ మంజూరులో అంతులేని అక్రమాలు జరుగుతున్నాయి. కూటమి నేతలు అడ్డగోలు వ్యవహారానికి తెరతీశారు. ఒక్కో దుకాణానికి రూ. 25 వేల నుంచి రూ. 50 వేల వరకు దండుకున్నట్లు సమాచారం. జిల్లాలో 122 తాత్కాలిక దుకాణాలకు ఇప్పటికే అధికారులు అనుమతులు ఇచ్చారు. ఒక్కో షాపు నుంచి రూ. 25 వేల చొప్పున లెక్క కట్టినా రూ. 30.50 లక్షలు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో దుకాణానికి రూ. 6 వేల చొప్పున కలిపి మొత్తం రూ.7.32 లక్షల ప్రభుత్వానికి వెళ్లగా .. మిగిలిన సుమారు రూ. 23 లక్షలు కూటమి నేతల జేబులోకి చేరినట్లు ఆరోపణలున్నాయి. మధ్యవర్తుల ద్వారానే లైసెన్సు జారీ అయినట్లు సమాచారం. దీంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు అమాంతంగా పెంచేసి విక్రయిస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి...

బాణసంచా విక్రయాల కోసం పలు విభాగాల అధికారులతో కూడిన కమిటీ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి. ఇక్కడే అసలు చేతివాటం మొదలవుతోంది. తాత్కాలిక విక్రయిదారులకు డీలర్‌షిప్ ఉండదు. దీంతో వారికి అడ్వాన్స్ లైసెన్సులు జారీ చేస్తారు. దీని ప్రకారం వారు విక్రయించబోయే సరుకు విలువపై 18 శాతం జీఎస్టీని ముందుగానే చెల్లించాలి. రూ. లక్ష విలువైన సరుకు విక్రయిస్తే రూ. 18 వేలు పన్నుగా చెల్లించాలి. వ్యాపారం ముగిశాక అమ్మిన సరుకు విలువ అంచనా కన్నా ఎక్కువైతే మిగిలిన పన్ను చెల్లించాలి. తక్కువ అయితే అదనంగా కట్టిన డబ్బును అధికారులు తిరిగి వెనక్కు ఇవ్వాలి. ఇక్కడ మాత్రం కొందరు వాణిజ్య పన్నుల విభాగం అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు సమాచారం. వ్యాపారులతో కుమ్మక్కై ఎంతసరకైనా అమ్ముకో.. ప్రభుత్వానికి కొద్దిగా పన్ను కట్టి, తమకు కొంత సమర్పిస్తే చాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. సర్కిళ్ల వారీగా వసూళ్లకు సిబ్బందిని నియమించి, వచ్చిన మొత్తాన్ని ఉన్నత స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పంచుకుంటున్నట్టు విమర్శలు ఉన్నాయి.

నిల్వలపై చర్యలేవి?

జిల్లాలో 39 శాశ్వత బాణసంచా కేంద్రాలు, 122 తాత్కాలిక కేంద్రాలు ఉన్నాయి. ఈ విక్రయ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. కూటమి నేతలు, అధికారులు అందిన కాడికి మామూళ్లు దండుకొని దుకాణాల్లో భారీగా నిల్వలు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో బాణసంచా నిల్వలను వ్యాపారులు దిగుమతి చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు నడుస్తున్నా మిన్నకుండిపోవడం వెనుక ఆంతర్యం ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పరిమితికి మించి నిల్వలు చేసినప్పటికీ హడావుడి చేయడం ... అనంతరం మిన్నకుండిపోవడం పరిపాటిగా మారింది.

దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట: దీపావళి పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సవాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. బాణసంచా కాల్చే సమయంలో అందరూ ముఖ్యంగా చిన్నపిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పర్యావరణానికి హాని లేకుండా కాలుష్య రహిత టపాసులు పేల్చాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా పండగ జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు, ఉద్యోగులు అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.


పీజీఆర్ఎస్ రద్దు

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను దీపావళి సందర్భంగా రద్దు చేసినట్లు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ..

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌ను దీపావళి సందర్భంగా ఈ నెల 20వ తేదీ సోమవారం రద్దు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 35,723 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,443 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలుగా ఉంది.

బలం లేకున్నా బరితెగింపు

- ఎంపీపీ పదవి కోసం అడ్డదారులు తొక్కుతున్న టీడీపీ
- సభ్యులకు బెదిరింపులు, ప్రలోభాలు
- 28న బలనిరూపణకు రంగం సిద్ధం

ఎంపీపీ పదవి కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎంపీటీసీ సభ్యులను బెదిరిస్తున్నారు. కాంట్రాక్టులు ఆశ చూపుతూ, రూ.3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఒక్కొక్కరికి ఇస్తామని ప్రలోభాలకు తెరదీస్తున్నారు. ఇప్పటికే ఇరువురు ఎంపీటీసీ సభ్యులకు చెందిన వ్యాపారాలపై కేసులు నమోదు చేశారు. ఇలాంటి కేసులనూ తొలగిస్తామని చెబుతున్నారు.

ముప్పాళ్ల: ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మానం కోరేందుకు కనీసం ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సి ఉంది. మండలంలో 12 మందికిగాను 11 మంది వైఎస్సార్‌సీపీ వారే ఉన్నారు. ఒక్క స్థానంలో జనసేన అభ్యర్థి గెలుపొందారు. నామమాత్రంగా కూడా టీడీపీ బరిలో నిలిచింది లేదు. అలాంటి సమయంలో ఆరుగురు సభ్యులకు కండువా కప్పి టీడీపీ సభ్యులుగా చెప్పుకొంటున్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసుకు ఎనిమిది మంది సభ్యులు అవసరమైతే, అందులో ఇద్దరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేశారంటూ బాధితులే బహిరంగంగా ప్రకటించారు. ఈ నెల 28వ తేదీన అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేలా అధికారులు నోటీసులు అందించారు. ఎనిమిది మంది సభ్యులు సమావేశం రోజున ఆర్డీవో ఎదుట హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా మద్దతు తెలపాల్సి ఉంటుంది. అప్పుడు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం అంగీకరిస్తూ సమావేశాన్ని ముగిస్తారు. కండువా మార్చిన ఎంపీటీసీ సభ్యులలో ఒకరిని ఎన్నుకుంటారు. అయితే కండువా మార్చిన వారిలో ఒకరు తనకు ఎంపీపీ పదవి ఇస్తేనే మద్దతు తెలుపుతానని చెబుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆ అభ్యర్థికి సీనియర్ నాయకుల అండ ఉందని సమాచారం. ఈ వివాదం నియోజకవర్గ నేత వద్దకు వెళ్లగా అందర్నీ కూర్చోబెట్టి మాట్లాడదామని చెప్పినట్లు తెలిసింది. జనసేన అభ్యర్థి కూడా ఎంపీపీ పదవి కోరగా, టీడీపీ నాయకుడు తిరస్కరించినట్లు సమాచారం.



ముప్పాళ్ళ మండల పరిషత్ కార్యాలయం

అక్రమ కేసులకు భయపడం



వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచాం. ఆ పార్టీలోనే ఉంటాం. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపాలని కోరారు. అంగీకరించకపోవటంతో అవిశ్వాస తీర్మానం కోసం సంతకాన్ని ఫోర్జరీ చేశారు. అంతేగాక మా ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడుల పేరుతో కేసులు నమోదు చేయించారు. అక్రమ కేసులకు భయపడేదే లేదు.

–ఎం.అనూష, లంకెలకూరపాడు ఎంపీటీసీ సభ్యులు

పదవుల కోసం దిగజారడం హేయం



ఉన్నత విలువలతో రాజకీయాల్లోకి వచ్చాం. పదవుల కోసం పార్టీలు మారి, దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం హేయమైన చర్య. వైఎస్సార్‌సీపీలో మహిళలకు గౌరవం దక్కింది. అందులో భాగంగానే ఏడు చోట్ల మహిళా ఎంపీపీలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాం. కూటమి ప్రభుత్వంలో మహిళల పట్ల గౌరవం లేకుండా పోయింది. ఎంపీపీ పదవే కావాలని టీడీపీ కండువా కప్పుకొని నీతిమాలిన రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసం.

–మారూరి పద్మ, ఎంపీపీ, ముప్పాళ్ళ మండల పరిషత్

లోక రక్షకుడిని స్మరించుకోవాలి



పూజాబలిని సమర్పిస్తున్న భాగ్యయ్య



పాల్గొన్న భక్తులు

మేత్రాసన పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

రెంటచింతల: ఏసుక్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలలో లోకరక్షకుడైన ఏసయ్యను క్రైస్తవులందరూ స్మరించుకోవాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి మహాఘన డా. చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. ఆదివారం కానుక మాత కళావేదిక వద్ద విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి ఆధ్వర్యంలో క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకల సమష్టి పవిత్ర పూజాబలి సమర్పించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ శాంతి కోసం ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వస్థత, ఆరాధన, విశ్వాసం పేరిట ఇవి కొనసాగుతున్నాయని వివరించారు. క్రైస్తవుల కోసం ప్రతి ఒక్కరూ తమ పాత్రను గుర్తించి ప్రార్థించాలన్నారు. పల్నాడు పరిధిలోని ఫాదర్లు, కన్యలు, క్రైస్తవ విశ్వాసులు ఈ వేడుకలలో పాలుపంచుకోవడం అభినందనీయం అన్నారు. ముందుగా అమ్మ జపమాల ప్రార్థన, జాతీయ పతాకం, రోమ్ నగరం పతాకం, జూబ్లీ వేడుకల పతాకాలను ఆవిష్కరించారు. తర్వాత దివ్య ప్రసాద ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. వేడుకలలో పాల్గొన్న వేల మంది భక్తులకు మహా అన్నదానం చేపట్టారు. కానుకమాత చర్చి సహాయ గురువులు రెవ. ఫాదర్ ప్రసన్నకుమార్, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సహాయకుడే నిందితుడు

- కాటికాపరి హత్యకేసులో పోలీసుల నిర్ధారణ
- పోలీసుల అదుపులో నిందితుడు
- వేధింపులు భరించలేక హత్య చేసినట్టు గుర్తింపు

నరసరావుపేట రూరల్: సంచలనం సృష్టించిన స్వర్గపురి–2 కాటికాపరి తాటిపర్తి ఎఫ్రాన్ హత్యకేసు మిస్టరీ వీడినట్టు తెలుస్తోంది. సహాయకుడే ఈ హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారని సమాచారం. క్రిస్టియన్‌పాలెంలో ఉన్న గ్రూపు తగాదాల వలన హత్య జరిగి ఉంటుందని పోలీసులు మొదట భావించారు. సాక్షిగా తీసుకువచ్చిన ఎఫ్రాన్ సహాయకుడిని తమదైన శైలిలో పోలీసులు విచారించగా అసలు నిజం వెలుగుచూసింది. తానే హత్యకు పాల్పడినట్టు అతడు అంగీకరించినట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. శివ సంజీవయ్య కాలనీకి చెందిన వ్యక్తి ఎఫ్రాన్ వద్ద సహాయకుడుగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఎఫ్రాన్ వేధింపులు ఎక్కువయ్యాయి. విసిగిపోయి హతమార్చినట్టు తెలిసింది. నిందితుడు తొలుత క్రిస్టియన్‌పాలెంకు చెందిన వారు హత్యకు పాల్పడినట్టు తప్పుడు సమాచారం ఇచ్చాడు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.

కార్తిక పూజలకు శివాలయం ముస్తాబు



పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసానికి సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్తికమాస ఏర్పాట్లపై డీసీ మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా ఈనెల 22 నుంచి నవంబరు 20 వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక కల్యాణార్థం నెలరోజుల పాటు ఉదయం మహాన్యాస పూర్వక రుద్ర జప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నామని తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు అష్టోత్తర పూజ జరుగుతుందన్నారు. నెల రోజులపాటు నిత్య పరోక్ష అభిషేక పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. రూ.వెయ్యి చెల్లించి ఈ పథకంలో పాల్గొనే భక్తులకు కార్తికమాసం అనంతరం స్వామివారి ప్రసాదం వారి చిరునామాకు పోస్టు ద్వారా పంపిస్తామని తెలిపారు. ఈ పథకంలో చేరిన భక్తులను కార్తిక మాసంలో ఆది, సోమవారాలు, పౌర్ణమి రోజులు మినహా ఇతర రోజుల్లో ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామి వారి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కూడా కలగకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా శాంతిభద్రతల నిమిత్తం పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది సేవలు వినియోగించుకుంటామని చెప్పారు. కార్తిక మాసం పర్వదినమైన పౌర్ణమి రోజున కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్తిక పర్వదినాలలో ప్రత్యేక పూల అలంకారం, విద్యుత్ కాంతులతో ఆలయాన్ని అలంకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

పీఆర్కే దీపావళి శుభాకాంక్షలు



సాక్షి, నరసరావుపేట: వెలుగుల పండుగైన దీపావళిని ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) తెలిపారు. దీపావళి సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని, శాంతిని నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, దుఃఖంపై సంతోషం విజయానికి ప్రతీకగా దీపావళి నిలుస్తోందన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. తగిన జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా 'సిద్దాడపు'



గురజాల: అఖిల భారతీయ యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా సిద్దాడపు గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఖిల భారతీయ యాదవ సభ ఏపీ, పుదుచ్చేరి రాష్ట్రాల సంయుక్త సమావేశం ఆదివారం యానాంలోని క్షత్రియ పరిషత్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు జరిగాయి. ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా దాదినబోయిన ఏడుకొండలు యాదవ్, పల్నాడు జిల్లా కార్యదర్శిగా సంక్రాంతి వెంకటేశ్వర్లు, గురజాల నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడిగా జి.కృష్ణంరాజు యాదవ్‌లను ఎన్నుకున్నారు. వీరి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అ'పూర్వం'.. ఆత్మీయం!

44 ఏళ్ల తరువాత కలుసుకున్న విజయపురి సౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1980–81 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

విజయపురిసౌత్: సుమారు 44 ఏళ్ల క్రితం వారంతా కలిసి చదువుకున్నారు. చదువులమ్మ ఒడిలో ఆడిపాడారు. ఆ తరువాత విడిపోయారు. సుదీర్ఘ జీవన ప్రయాణంలో విభిన్నదారుల్లో సాగి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణించారు. జీవితం యాంత్రికమైపోయింది. మనసులో ఏదో తెలియని వెలితి అందరిని పట్టి పీడించింది. మూలమేదో గుర్తించారు. ఒక్కసారి చిన్ననాటి స్నేహితులను కలుసుకోగలిగితే చాలు అనుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 25 మంది చిరునామాలను సేకరించారు. వివరాల్లోకి వెళితే.. విజయపురి సౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1980–81 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సికింద్రాబాద్ పార్క్ హోటల్లో కలుసుకొని ఒకే వేదికపై చేరుకున్నారు. ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం... అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఫోన్ నెంబర్లు, చిరునామాలు సేకరించుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. అపురూపమైన జ్ఞాపకాలను తమ స్నేహబంధానికి గుర్తుగా గ్రూప్ ఫొటోలు దిగారు. తమ తోటి విద్యార్థులు కలిసేందుకు అందరి చిరునామాలు సేకరించి ఒకే వేదికపై తీసుకువచ్చేందుకు కృషి చేసిన ఆర్గనైజర్, ఎంపీడీఓ బి.నాగరాజును పూల దండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పూర్వ విద్యార్థులు పైడి నాయుడు, ఎస్‌వీ రమేష్, శ్రీనివాసరెడ్డి, ఐజక్, రంగారెడ్డి, జంగయ్య, ఆయేషాను సత్కరించారు. పూర్వ విద్యార్థులు సౌత్‌సెంట్రల్ రైల్వే డీసీఎం కె.కమలాకర్‌బాబు, నల్గొండ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, మిర్యాలగూడ కేరలి విద్యాసంస్థల అధినేత షేక్ అహమ్మద్, బెంగళూరు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయుడు య.వెంకటేశ్వరావు, మాలతి, సరళ, లిల్లి, మాస్క్ కుర్మానీ, కనకవల్లి తదితరులు పాల్గొన్నారు.

టెయిల్ పాండ్ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లు ఎత్తివేత



నిండుకుండలా ఉన్న నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్

పులిచింతలకు 29,803 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ మూడు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్ల ద్వారా 29,803 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 3 క్రస్ట్ గేట్లు 1.5 మీటర్లు ఎత్తు ఎత్తి 21,258 క్యూసెక్కులు, రెండు యూనిట్లు ద్వారా 8,545 క్యూసెక్కులు మొత్తం 29,803 క్యూసెక్కులను దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 75.50 మీటర్లకు గాను 75.50 మీటర్లకు నీరు చేరుకుందని రిజర్వాయర్‌లో గరిష్ట స్థాయిలో 7.080 టీఎంసీలకు గాను 7.080 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.68 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం ఎగువ నున్న నాగార్జునసాగర్ నుంచి 34,185 క్యూసెక్కుల నీరు వస్తుందని పై నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

హేతువాద సాహిత్య పితామహుడు త్రిపురనేని

సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య



మాట్లాడుతున్న ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీ నరసయ్య

లక్ష్మీపురం: తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామిచౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీ నరసయ్య అన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి పురస్కార ప్రదాన సభకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణ ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు రామస్వామి పురస్కారాలు ఇవ్వడం సముచితమని అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించింది రామస్వామి అని అన్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లులకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరి సుధ తదితరులు పాల్గొన్నారు.

హరిత దీపావళి.. ఆనంద హేళి



యడ్లపాడు: దీపావళి అంటేనే ప్రమిద దివ్వెలు..బాణసంచా వెలుగులు. పండుగలన్నింటిలో దీపావళి సందడి వేరు. చీకటిని పారదోలి వెలుగులు నింపే పండుగగా..విజయానికీ ప్రతీకగా దీపావళిని ఏటా ఆశ్వీయుజ మాసంలో ఆమావాస్య రోజున జరుపుకోవడం ఆనవాయితీ. పండుగ అంటే అన్ని కష్టాలు మరచి కుటుంబమంతా సంతోషంగా గడిపే సందర్భం. అయితే మితిమీరిన ఉత్సాహంతో మన ఆనందాన్ని తీవ్ర ఆవేదనగా మార్చకూడదు. ఈ పండుగను మరో ఏడాదిపాటు మరవలేని తీపి గుర్తుగా నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల స్ఫూర్తితో నేడు దీపావళి పండుగను ఆనందంగా, ఆహ్లాదంగా, పర్యావరణ హితంగా జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- దీపావళి పండుగ సందర్భంగా జరిగే ప్రమాదాలు, కాలుష్యంపై పర్యావరణ నిపుణులు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం పలు కీలక సూచనలు చేసింది. పర్యావరణాన్ని కాపాడేందుకు హరిత దీపావళిని నిర్వహించుకోవాలంటూ ఆదేశించింది. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా బాణసంచా నిషేధించాలని ఈ ఏడాది సుప్రీంకోర్టు సీజే బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. టపాసులు కాల్చడానికి రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అనుమతినిచ్చింది. అయితే దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా, రోజులో ఏవైనా రెండు గంటల పాటు టపాసులు కాల్చుకునేందుకు సడలింపు ఇచ్చింది. టపాసులు ఇళ్ల లోపల కాల్చడం వల్ల వెలువడే విష వాయువులు మూలల్లో నిలిచిపోయి, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- ఈ నిబంధనల నేపథ్యంలో పర్యావరణ హితమైన 'గ్రీన్ టపాసులు' (తక్కువ పొగ, తక్కువ శబ్దం) మార్కెట్లోకి అందుబాటులో వచ్చాయి. శబ్దాలు చేసే టపాసుల స్థానంలో ఫ్లవర్ పాట్స్, పెన్సిల్స్, భూ చక్రాలు, స్పార్కులర్లు, కాకరొత్తులు, చిచ్చుబుడ్లు వంటి సురక్షితమైనవి మాత్రమే కాల్చుకోవడం మంచిది. మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుద్దీపాలు వెలిగించడం శుభప్రదం. ముఖ్యంగా నెయ్యి దీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ కూడా అధికంగా వెలువడుతుందని పెద్దలు చెబుతున్నారు.
- టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలని, కళ్లకు రక్షణగా కళ్లజోడు, పాదాలకు బూట్లు తప్పనిసరిగా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సగం కాలిన టపాసులను మరోసారి కాల్చాలని ప్రయత్నించి దగ్గరకు వెళ్లవద్దని, అవి ఆకస్మాత్తుగా పేలే ప్రమాదం ఉందని అగ్నిమాపక అధికారులు హెచ్చరిస్తున్నారు. వాటిని వదిలేయడమే ఉత్తమం. పండుగ సరదా శాపంగా మారకుండా ఉండాలంటే, కాలుష్యంతో పాటు ప్రమాదాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. టపాసుల తయారీలో వాడే విషపూరిత రసాయనాలు, లోహాలు గాలి, శబ్ద కాలుష్యాన్ని పెంచుతాయి. అందువల్ల పూర్తిగా విషపూరితమైన వాటిని కాల్చి మన ప్రమాదాన్ని మనమే సృష్టించుకున్నట్లు ఉండకూడదు. ప్రతి ఒక్కరూ ఈ దీపావళిని ఆనందంగా, ఆరోగ్యంగా, పర్యావరణహితంగా జరుపుకోవాల్సిన బాధ్యత ఉంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రెండు సవర్ల బంగారు ఆభరణాలు మాయం!



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

యడ్లపాడు: మండలంలోని కోట గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. ఇంటి యజమాని ఊరు వెళ్లిన సమయంలో దుండగులు చొరబడి సుమారు బంగారం, వెండి, ఇత్తడి వస్తువులను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోట గ్రామానికి చెందిన షేక్ ఖైరున్నీసా ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం నరసరావుపేటలోని తన కోడలి ఇంటికి వెళ్లింది. రెండురోజుల తర్వాత 18వ తేదీ సాయంత్రం కోట గ్రామానికి తిరిగి రాగా ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించింది. 12 గ్రాముల బంగారు గొలుసు, 4 గ్రాముల చెవిదుద్దులు, వెండిపట్టీలు, ఇత్తడి సామగ్రి అపహరణకు గురైనట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశారు. వెంటనే క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని, ఆధారాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

15 మందికి గాయాలు



కుక్క దాడిలో గాయపడిన బాలుడు

గురజాల: పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 15 మందిని గాయపర్చింది. నగర పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం రోడ్డులో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పిచ్చి కుక్క కనిపించిన వారిని కనిపించినట్లు కరుస్తూ వెళ్తుంది. కుక్క దాడిలో 15 మందికి గాయాలు కాగా గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. నగర పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి కుక్కలను పట్టించి అడవిలో వదిలి వేయాలని కోరుతున్నారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

అనాథ యాచకుడి అంత్యక్రియలు



మృతుడు ఆలేటి యాదగిరి

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామం వద్ద మృతి చెందిన యాచకుడికి పంచాయతీ, పోలీసు సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆలేటి యాదగిరి(46) అనే దివ్యాంగుడు సుమారు 25 సంవత్సరాల క్రితం మాదల గ్రామానికి వచ్చి దేవుడు గుడి, సమీపంలోని పాఠశాలల వద్ద ఉంటూ వారిచ్చే ఆహారం తింటూ జీవనం సాగిస్తుండేవాడు. యాదగిరికి రెండు చేతులు సరిగ్గా ఉండవు. దివ్యాంగుడు కావటంతో స్థానికులు కూడా ఆహారం అందించేవారు. ఈక్రమంలో ఆదివారం సత్తెనపల్లి – నరసరావుపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న సత్రం గోడ వద్ద యాదగిరి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన స్థానికులు జవంగుల సాంబశివరావు సత్రం లోపలికి తీసుకెళ్లి కూర్చోబెట్టారు. కొద్దిసేపటికి యాదగిరి మృతి చెందటంతో సమాచారాన్ని పోలీసులకు అందించారు. పంచాయతీ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో యాదగిరికి అంత్యక్రియలు నిర్వహించారు.

చలన చిత్ర చరిత్రలో 'ఘంటసాల ది గ్రేట్' అద్భుతం



చీరాల: తెలుగు సినిమా చరిత్రలో 'ఘంటసాల ది గ్రేట్' చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆ సినిమా డైరెక్టర్ సీహెచ్. రామారావు అన్నారు. చీరాలలోని మోహన్ థియేటర్‌లో ఆదివారం ప్రదర్శించిన ప్రివ్యూ షో సంగీత అభిమానులను ఆకట్టుకుంది. చీరాలలో డైరెక్టర్ సీహెచ్. రామారావు అభిమానులతో కలిసి సినిమా తిలకించారు. ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఒక గాయకుడిపై తీసిన అరుదైన సినిమా' ఘంటసాల ది గ్రేట్ ' అని పేర్కొన్నారు. ఒక తరం సంగీతానికి ప్రాణం పోసిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 12న విడుదల చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, గాదె వెంకటరెడ్డి, గాదె హరిహరరావు, పాలెపు కనక మోహనరావు, రాజ్ వినయ్‌కుమార్, నాగవీరభద్రాచారి, ఏకాంబరేశ్వరబాబు, వీరనారాయణ, హరిహరరావు, రామారావు, రాజ్యలక్ష్మి, సునీత, రంగారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు నాయకులకు జిల్లా పదవులు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు నాయకులను జిల్లా పదవుల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీలుగా నరసరావుపేటకు చెందిన గెల్లి బ్రహ్మారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీగా గురజాలకు చెందిన కలకంద అంద్రయ్యను నియమించారు.

పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం

బాపట్లటౌన్: మండలంలోని జమ్ములపాలెం పంటకాలువలోకి గుర్తుతెలియని మృతదేహం కొట్టుకువచ్చిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ సీఐ కె. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి శరీరంపై బూడిద రంగు టీ షర్ట్, నలుపు రంగు నైట్ లోయర్ (ప్యాంటు), కుడి చేతికి దేవుడు బొమ్మలు కలిగిన తాడు కట్టుకొని ఉన్నారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడన్నారు. చనిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9440796258 కు సమాచారం అందించాలన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, ఎంపిక కమిటీ సభ్యులు

పిడుగురాళ్ల: సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో పట్టణంలోని కళ్లం టౌన్‌షిప్‌లో ఉన్న స్కాలర్స్ డిగ్రీ కాలేజీ మైదానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక ఆదివారం నిర్వహించారు. ఎంపికకు జిల్లా నుంచి సుమారుగా 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఎంతో మంది అత్యుత్తమ స్థానంలో ఉన్నారన్నారు. గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సామంత్‌రెడ్డి, కోశాధికారి ఆవుల జనార్దన్ నేతృత్వంలో ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో స్కాలర్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, మూలగొండ్ల జగదీష్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, కొత్త సత్యం, లయన్స్ క్లబ్ సభ్యులు గుండా నారాయణ, కొత్త కాశీవిశ్వనాథం, డీపీ స్వామి, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు..

పి.బాలకృష్ణ, బి.రాంబాబు, జె.టైసన్‌బాబు, బి.అనిల్‌కుమార్, ఎం.ప్రేమ్‌కుమార్, వై.గోపి, సాగర్‌బాబు, హేమంతు, సల్మాన్, శివకోటేశ్వరరావు, నరేంద్ర, యశ్వంత్, జానారెడ్డి, జేమ్స్, అభినవ్, ఎం.మెరిసి, ప్రభాకర్, స్టాండ్‌బైలుగా గౌతమ్, శ్రీహర్ష, సంజీవ్‌బాబు, కార్తీక్, పవన్, కిరణ్‌నాయక్‌లు ఎంపికయ్యారు.

ప్రజారోగ్యంపై కల్తీ కత్తి

- పేటలో నకిలీ నూనెల తయారీ కేంద్రాల జోరు
- దీపావళి, కార్తిక మాసంలో మార్కెట్‌లోకి..
- చోద్యం చూస్తున్న అధికారులు

నరసరావుపేట టౌన్: అగ్గిపుల్లా.. సబ్బుబిళ్లా కల్తీకి కాదేది అనర్హం అన్నాడు ఓ కవి. ముఖ్యంగా పూజకు ఉపయోగించే నకిలీ నువ్వుల నూనెలపై నకిలీ మాఫియా కళ్ల పడ్డాయి. నరసరావుపేట కేంద్రంగా కల్తీ నూనె తయారై యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్తుంది. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు బరితెగిస్తున్నారు. దీపావళి పండగను పురస్కరించుకొని పెద్దఎత్తున కల్తీ నువ్వుల నూనెను మార్కెట్‌లో క్రయ, విక్రయాలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. పవిత్ర కార్తికమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వివిధ రకాల నూనెలు, ఇతర సామాగ్రిని ప్రజలు అధికంగా వినియోగిస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న అక్రమార్కులు బ్రాండెడ్ కంపెనీల మాదిరిగా నకిలీ నూనెలను తయారు చేసి విక్రయిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.

నరసరావుపేట నుంచే ఇతర రాష్ట్రాలకు సరఫరా..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నరసరావుపేట అక్రమ వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడి నుంచే ఇతర రాష్ట్రాలకు నూనె రవాణా చేస్తున్నారు. ఆఫర్ల పేరుతో నకిలీ నూనెలను చాలాచోట్ల అంటగడుతున్నారు. ఒక నరసరావుపేటలోనే 20కి పైగా నూనె తయారీ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారంగా మరెన్నో ఉన్నట్లు ఆరోపణలు లేకపోలేదు. బహిరంగ మార్కెట్‌లో నూనె లీటరు ధర రూ.250 నుంచి రూ.260 వరకు పలుకుతుండగా.. నకిలీవి రూ.100 నుంచి రూ.150కే విక్రయిస్తున్నారు. సొంతంగా ధరలు, తయారీ కేంద్రం చిరునామా లేబుల్స్ అంటిస్తున్నారు. అధికారులు వాటిని పట్టుకునే ప్రయత్నం చేస్తే అక్కడ అసలు తయారీ కేంద్రాలే ఉండవు. ఈ విషయం ఇప్పటికే అధికారుల దాడుల్లో అనేక సార్లు స్పష్టమైంది.

కేసులు పెడుతున్నా మార్పు లేదు..

గతేడాది కార్తిక మాసానికి కొన్ని రోజుల ముందు అధికారులు నూనె తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి మూడు కేసులు నమోదు చేశారు. ఆహార కల్తీ తనిఖీ శాఖ, తూనికల కొలతల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో దాడులు నామమాత్రంగానే జరుగుతున్నాయి. కల్తీలపై సమాచారం ఉన్నా అక్రమార్కులు వద్ద తీసుకునే నెలవారీ మామూళ్లతో మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలున్నాయి. నరసరావుపేటలో నువ్వుల నూనె తయారీ, విక్రయ దుకాణాల్లో ఆహార కల్తీ తనిఖీ అధికారులు ఇటీవల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఐదు చోట్ల నకిలీ, కల్తీ నూనెలు ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. రూ.2.50 లక్షల జరిమానా విధించారు. అయినప్పటికీ అక్రమార్కులు యథావిధిగా తిరిగి కల్తీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

కల్తీతో ఆరోగ్యానికి ముప్పు ..

నకిలీ నూనెల నుంచి వెలువడే పొగను పీల్చితే శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, కాలేయ సంబంధ వ్యాధులు వస్తాయని, పర్యావరణం దెబ్బతింటుందని వైద్యనిపుణులు చెప్పుకొస్తున్నారు. బ్రాండెడ్ నూనెను నువ్వులతో తయారు చేస్తారు. నకిలీ నూనెను నువ్వులు, బియ్యం తవుడుతో పాటు తక్కువ నాణ్యతగల సువాసన ద్రావకాలతో తయారు చేస్తున్నారు. హోటళ్లలో వినియోగించిన నూనెను రీసైక్లింగ్ చేసి కొత్తగా మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నారు. జంతు కళేబరాల నుంచి తయారు చేసిన నూనెను సైతం నరసరావుపేట లో విక్రయించిన సంఘటనలు గతంలో ఉన్నాయి. దీని ఫలితంగా ప్రజల ఆరోగ్యం, పర్యావరణం రెండూ దెబ్బతింటాయి. కార్తిక మాసంలో నూనెల వ్యాపారం రూ.కోట్లలో ఉంటుంది. నరసరావుపేట, చిలకలూరిపేట లాంటి పట్టణాల్లోనే రూ.లక్షల్లో ఉంటుంది. చాలామంది వ్యాపారులు నూనెల అమ్మకాల్ని తక్కువగా చూపించి ప్రభుత్వానికి పన్నులు సైతం ఎగవేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కల్తీ నూనెలు విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవు. అనుమానంతో పాటు ఫిర్యాదులు ఉన్న నూనె తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–పూర్ణచంద్రరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా ఫుడ్ కంట్రోలర్